ఏ గుండెను కదిలించినా క 'న్నీటి వరదే' !

- 53 రోజులైనా ప్రభుత్వ సాయం అందకపోవడంతో కన్నీటిపర్యంతమైన వరద బాధితులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):'పేక మేడలు కూలినట్లుగా... హోరుగాలికి దీపం ఆరి నట్లుగా.. ఒక్కసారిగా మా బతుకులన్నీ తలకిందులయ్యాయి. పిల్లాపాపలతో ఇళ్లల్లో ఆనందంగా ఉన్న తమను వరద రూపంలో వచ్చిన ఆపద.. ఒక్కసారిగా తమ బతుకులను రోడ్డున పడేసింది.. ఏళ్ల తరబడి శ్రమించి సంపాదించుకున్న ఇంటి సామాన్లన్నీ వరద నీటి ప్రవాహంలో కళ్ల ముందే నాశనమవుతున్నా... ఇంటిపైకప్పులపైకి ఎక్కి అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని ఉన్నాం.. తిండి లేకపోయినా.. తాగునీరు అందకపోయినా బతుకుజీవుడా అంటూ అంధకారంలోనే నిద్రాహారాలు మానుకొని దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నాం.. అంతా అయ్యాక ప్రభుత్వం మాకు


తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తులు ఇస్తున్న వరద బాధితులు

అండగా నిలుస్తుందని ఆశపడితే మా ఆశలన్నీ అడి ఆశలయ్యాయి.. మేము నష్టపోయినదంతా తిరిగి ఇవ్వకపోయినా తిరిగి మేము నిలబడేందుకు ఆర్థిక భరోసాను కల్పించమని ప్రాధేయపడుతున్నా.. ఒక్కరు కూడా మా గోడు పట్టించుకోవడం లేదు..' అంటూ బుడమేరు వరద బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సింగ్‌నగర్ నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం వచ్చిన సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, శాంతినగర్, ప్రకాష్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, కండ్రిక, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లోని వరద బాధితులు అధికారులు, మీడియా ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు.

ఒక్క రూపాయి రాలేదు



బుడమేరు వరదల్లో ఇంటిలోని సామాన్లన్నీ పోయాయి. సాయం కోసం అనేక సార్లు దరఖాస్తు చేసినా డబ్బులు పడలేదని చెప్పారు. ఇప్పుడు మీకు డబ్బులు వచ్చాయి కానీ జగన్ ప్రభుత్వంలో వచ్చిన మీ ఇంటి రుణం కోసం వాటిని కట్ చేశామని చెబుతున్నారు. చేయూత డబ్బులు, డ్వాక్రా డబ్బులు కూడా ఇలానే కట్ అయ్యాయని చెబుతున్నారు. మాకు ఆ ఇల్లు ఎక్కడుందో కూడా తెలీదు. నేను, నా భర్త తినడానికి తిండి లేకుండా అల్లాడిపోతుంటే ఇలా మాతో ఇష్టం వచ్చినట్లు ఆడుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పుతున్నారు. ఒక్క రూపాయి కూడా సాయం చేయడం లేదు. – షేక్ జ్యోతి(వాంబేకాలనీ).

పాపం ఊరికేపోదు



వరదల్లో చిక్కుకొని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బతికాము. ఎమ్మెల్యే బొండా ఉమాకానీ, ప్రభుత్వ పెద్దలు, అధికారులు కానీ ఒక్కరూ కూడా మమ్మల్ని వచ్చి బతికామా.. సచ్చామా అని చూసిన నాథుడు లేడు. వరదల్లో సర్వం కోల్పోయాము. కనీసం ఇస్తామన్న ఆర్థిక సహాయం కూడా ఇవ్వకుండా 50 రోజుల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. మా పాపం ఊరికేపోదు.. ఇలా అమాయక ప్రజలతో ఆడుకుంటున్న వారిని దేవుడు అస్సలు క్షమించడు. – అనురాధ, ప్రకాష్‌నగర్.

పట్టించుకోవడం లేదు



నా భర్త ర్యాపిడో నడుపుతూ జీవనం సాగిస్తున్నాము. మాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వరదల్లో మాకు జీవనాధారమైన బైకు మునిగిపోయి పాడైపోయింది. మాకు సాయం చేయమని ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ, ప్రభుత్వ అధికారులు, సచివాలయాల అధికారులకు ఎన్నిసార్లు వెళ్లి మొత్తుకున్నా.. దరఖాస్తులు సమర్పించినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు.– షేక్ షబ్నామ్(సింగ్‌నగర్)

కుంటి సాకులు చెబుతున్నారు



వరదల్లో మా ఇళ్లు మొత్తం పూర్తిగా మునిగిపోయాయి. ఇంట్లో సామాన్లన్నీ పోయాయి. ప్రభుత్వ సాయం ఇప్పటి వరకూ అందలేదు. అదేమని అడిగితే మీది మ్యాపింగ్ చూపించడం లేదని కుంటిసాకులు చెబుతున్నారు. మా వాహనాలు మునిగిపోతే వాటికి రూ.3 వేలు వేసి చేతులు దులుపుకున్నారు. వాటికి కనిపించిన మ్యాపింగ్ ఇంటి సాయం కోసం ఇచ్చే రూ.25 వేలకు మాత్రం ఎందుకు చూపించడం లేదని చెబుతున్నారో అర్థం కావడం లేదు. అదేమని అడుగుతుంటే 58వ డివిజన్‌లోని 258 వార్డ్ సచివాలయం వారు కానీ, వీఆర్‌ఓలు కానీ సమాధానం చెప్పకుండా తిప్పుకుంటున్నారు. – కేకే జమునాభాయి, శ్రీవల్లి(సింగ్‌నగర్)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ అరండల్ పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 19వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రెహమాన్ వీధి, శేషాద్రి శాస్త్రి వీధి, కోదండరామి రెడ్డి వీధి, యార్లగడ్డ వారి వీధి, రామ మందిరం వీధి, వెంకటేశ్వరరావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్):పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్‌లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నందును ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతినగర్, శాంతినగర్, ప్రగతినగర్, దేవినేని గాంధీపురం, వాంబేకాలనీ, పాయకాపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

25న మెగా రక్తదాన శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) ఆధ్వర్యంలో ఈ నెల 25న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా విజయవాడలోని ఎంజే నాయుడు ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం అందిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన రక్తదాతలు అందరూ పాల్గొనవచ్చన్నారు.

క్లుప్తంగా

ఎలుకల నివారణ మందు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విలేజి కండ్రికలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు ఎలుకల నివారణ మందును 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ అందచేశారు. వరి పంట పొలాల్లోని బొరియల్లో ఎలుకల నివారణ మందును ఉపయోగించి పంటను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు ధాన్యాన్ని ఎక్కడైనా విక్రయించుకోవచ్చని చెప్పారు. యరగొర్ల శ్రీరాములు, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రంజింప చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జగ్గయ్యపేటకు చెందిన శ్రీ త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీకి చెందిన శ్రీభారత దేవి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కొలువైతివా రంగసాయి.. అయిగిరి నందిని.. బృందావన నిలయే వంటి కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను వీక్షించి మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షల్లో ఎన్టీఆర్ జిల్లా మెరుగైన ఫలితాలను సాధించే దిశగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ రామరాజు కోరారు. జిల్లాలో పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా పునశ్చరణ తరగతులు బుధవారం నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాను మొదటి స్థానంలో ఉంచే దిశగా ఉపాధ్యాయులు పాటు పడాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకూ రోజుకొక సబ్జెక్ట్‌పై టీచర్లకు పునశ్చరణ తరగతులు జరుగుతాయన్నారు. జిల్లాలోని అందరూ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు వీటికి తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఉమర్‌అలీ, నార్త్ ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు బస్సుల మధ్య ఇరుక్కొని మహిళా ఉద్యోగి దుర్మరణం

పటమట(విజయవాడతూర్పు): ఆటోనగర్ బస్ డిపోలో బస్సు వెనక్కి తిప్పుతుండగా జరిగిన ప్రమాదంలో బస్సు వెనుక ఉన్న మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగి బుధవారం దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .... కృష్ణలంకకు చెందిన మరియమ్మ ఆటోనగర్ ఆర్టీసీ బస్ డిపోలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తుంది. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మరియమ్మ బస్సును శుభ్రం చేస్తుంగా అదే సమయంలో మరో బస్సు డ్రైవర్ రివర్స్ చేసే సమయంలో మరియమ్మను గమనించకపోవటంతో ఆమె రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో మరియమ్మకు బలమైన గాయం తగలగా డిపో సిబ్బంది ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం తాడేపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న మరియమ్మ బుధవారం మరణించింది. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):బుడమేరు వరద బాధితులకు బుధవారం దావు బుచ్చయ్యకాలనీ నజరేతు ప్రార్థన మందిరంలో బడావో బంజారా ఫోజెర్ ట్రస్ట్ ఆధ్వర్యాన బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ భూక్యా లాజరస్ లాల్‌సింగ్ మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు తమ బాధ్యతగా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బిషప్ నతానియేలు నాయక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్, ప్రేమ్ సాగర్ సింగ్, మేనేజర్ సోలోమెన్, సంస్థ ప్రతినిధులు రామాచారి, బాలరాజు, సందీప్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు


వీవీనరసరాజు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది


జేసీబీని అడ్డుకున్న ఆక్రమణదారులు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు అధికారులు స్పందించారు. మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులో దేవాలయాలపేరిట చేస్తున్న ఆక్రమణలను బుధవారం టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు తొలగించారు. వీవీనరసరాజు రోడ్డులో కోట్లాది రూపాయల విలువైన ఇరిగేషన్ స్థలంలో ఆలయాల పేరిట చేస్తున్న ఆక్రమణలను సాక్షి పలు కథనాల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం ఉదయం ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పెద్ద సంఖ్యలో ఆలయాల వద్దకు చేరుకుని అక్రమంగా నిర్మించిన ఆలయాలను పొక్లెయిన్‌లతో తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. కొద్దిసేపు అధికారులు, ఆక్రమణదారుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ రోడ్డులో ఇప్పటికే శ్రీకృష్ణ మందిరం, చర్చిలు, ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించకుండా ఇక్కడ ఎలా తొలగిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు గుణదల పోలీసుల సహకారం కోరినప్పటికీ తాము తమ సీపీ ఆదేశాలు ఉంటేనే సహకరిస్తామంటూ చెప్పటంతో చేసేది లేక అధికారులే ఆక్రమణలను తొలగించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణను ఆక్రమణదారులు అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడటంతో పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆక్రమణలను తొలగించేందుకు వచ్చిన అధికారులు సిబ్బందిని అధికార పార్టీ నేతలు అడ్డుకోవటం గమనార్హం. కోట్లాది రూపాయల విలువైన ఇరిగేషన్ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడిన టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ ఫుట్‌బాల్ సంఘం అక్రమ ఎన్నికలపై చర్యలు తీసుకోండి

విజయవాడస్పోర్ట్స్: గత ఏడాది మే నెలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్‌ఏ) ఎన్నికలు అక్రమమని, దీనిపై చర్యలు తీసుకుని క్రీడాకారులకు న్యాయం చేయాలని ఏపీఎఫ్‌ఏ మాజీ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంఘ మాజీ సభ్యులతో కలిసి విజయవాడలోని ఓ హోటల్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వారిని ఓటర్లుగా చేర్చి ఎన్నికలు అక్రమంగా నిర్వహించి దౌర్జన్యంగా కొందరు వ్యక్తులు సంఘ ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమంపై హై కోర్టును ఆశ్రయించామన్నారు. సంఘానికి ఏకపక్షంగా జరిగిన ఎన్నికలు చెల్లవన్నారు. సంఘ మాజీ ప్రతినిధులు సుబ్బరాజు, ఆనందలాల్, రాయుడు నాగేశ్వరరావు, రామచంద్ర, దీపక్‌రాజ్, దత్తారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్):సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ సూచించారు. కండ్రిక మణికంఠ నగర్లోని లక్ష్మి అపార్టుమెంటు వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకు వచ్చే లింకుల్లో మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు చూడవద్దని కోరారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

ఎస్‌ఎన్‌పురం సీఐ బాలరాజాజీ


పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తు ప్రదర్శనలో పాల్గొన్న సీఐ బాలరాజాజీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో అశువులుబాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటు ప్రభాస్ కళాశాల విద్యార్థులతో కలసి ఎస్‌ఎన్‌పురం పోలీసులు బుధవారం ప్రదర్శన నిర్వాహించారు. ప్రభాస్ కళాశాల నుంచి సీతన్నపేట గేటు వరకు సాగిన ఈ ప్రదర్శలో పాల్గొన్న ఎస్‌ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వై.బాలరాజాజీ మాట్లాడుతూ సమాజంలో మనకు ఏ కష్టం వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులే అన్నారు. కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను పక్కన పెట్టి అహర్నిశలు ప్రజల కోసం విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అసాధారణ పరిస్థితిలో తమ ప్రాణాలను సైతం లేక్కచేయకుండా అశువులబాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మనం వారికి ఇచ్చే ఘనమైన నివాళులన్నారు. అటువంటి అమరవీరులను స్మరించుకుంటు ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార హక్కు చట్టం-2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తి త్యాగరాజు అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆర్టీఐ కార్యకర్తలు ఇచ్చే అర్జీలకు సకాలంలో సరైన సమాచారం అందించాలన్నారు. ప్రజా ప్రయోజనం కోసం చేపట్టే వినతి పత్రాలపై, అధికారులు అర్జీదారుల పేర్లను గోప్యత పాటించాలన్నారు. చట్టం అమలు జరగాలంటే సమర్థవంతమైన కమిషనర్లను నియమించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా సమాచారం అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్న ప్రభుత్వ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండేందుకు సిటిజన్ చార్టులు ప్రతి ప్రభుత్వ కార్యాలయం ముందు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కూడా ఈ సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన పెంచుకొని, తమ గ్రామాల్లో అవినీతి అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. ఆర్టీఐ దరఖాస్తుదారులపై జరిగే దాడులు అడ్డుకోవడానికి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు కాకర్ల అశోక్ కుమార్, కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు, శిరీష్ బాబు లక్ష్మణరావు, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రం ప్రారంభం


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐటీయూ నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):2021 నాటికి గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. రాణిగారితోటలోని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అప్లికేషన్ కావాల్సిన వారు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకునే వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. శాసనమండలిలో కార్మికుల హక్కులు, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, వారు బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆశావర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కమల, సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, ఎం.సోమేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశపు హాల్లో బుధవారం ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం వరద ప్రభావితం కాని ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, ఆస్తి, ఇతర పన్నుల అంశాల పురోగతిపై అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. నూతనంగా నిర్మించిన భవనాలు, అదనంగా వేసిన ఫ్లోర్లు, ఏమేమి ఉన్నాయో రెవెన్యూ అధికారులు పర్యటించి ఎప్పటికప్పుడు పన్నులు వేయాలని సూచించారు. ఆస్తిపన్ను అనంతరం నీటి పన్ను కూడా ఉందా లేదా అనేది పరిశీలించాలని పేర్కొన్నారు. పన్నుల వ్యవహారంలో రెవెన్యూ-ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం , అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరికీడు గ్రామ సచివాలయంలో చోరీ


పెరికీడు సచివాలయంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సురేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గ్రామ సచివాలయంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామ సచివాలయం తలుపులు బద్దలుకొట్టి లోపల ఉన్న కంప్యూటర్ ప్రింటర్, సౌండ్ స్పీకర్, ఇతర ఆఫీసు సామగ్రిని దొంగిలించారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులు తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. కార్యాలయంలో చోరీ జరిగినట్లుగా గుర్తించిన సచివాలయం సిబ్బంది హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.సురేష్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-3 పరిధిలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రిజర్వాయర్-1లో ఇంటర్ కనెక్షన్ పనిచేయటం లేదని, దీన్ని మరమ్మతులు చేసే నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే 7, 8, 9 డివిజన్లలోని బాడవపేట, నెహ్రూనగర్, మొగల్రాజపురం, నవోదయ కాలనీ, జర్నలిస్టు కాలనీ, పీవీపీ రోడ్డు, డింపుల్‌బార్ రోడ్డు, వరమహాలక్ష్మీ రోడ్డు, మల్లెల పరమేశ్వరరావు రోడ్డు, ఉడ్‌పేట, శాంతినగర్, మధు గార్డెన్స్ రోడ్డు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు నిలిపేస్తున్నామని తెలిపారు. ఇంకా రెల్లీస్ బజారు, లబ్బీపేట, పైడయ్యవీధి, వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు, తుర్లపాటి కుటుంబరావు వీధి, గౌరయ్యనగర్, నేతాజీ బ్రిడ్జి రోడ్డు, కృష్ణానగర్ రోడ్డు, లక్ష్మీనగర్, గౌస్ వీధి, మస్జీద్ వీధి, గ్రీన్‌ల్యాండ్స్ రోడ్డు, చంద్రమౌళిపురంలో నీటి సరఫరా ఉండదని తెలిపారు. శ్రీ రామనగర్, ఫకీర్‌గూడెం, ఆదార్ష్ రోడ్డు, వైవీరావు ఆస్పత్రి రోడుడ, కళా నగర్, సాయి నగర్, పిట్టింగుల పేట, గాయత్రీ నగర్; కంచుకోట బజారు, పాత 5వ నంబరు బస్సురూటు, అశోక్‌నగర్, రామచంద్ర నగర్, బ్యాంక్ కాలనీ 1,2, రెవెన్యూ కాలనీ, టిక్కిల్ రోడ్డు, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, శ్యామ్‌నగర్, సిద్ధార్థ నగర్, బృందావన కాలనీ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

గన్నవరం/ఉంగుటూరు: దొంగతనం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, ఉంగుటూరు ఎస్ఐ గోవిందు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దావాజిగూడెం శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న చావలి మురళీ కృష్ణ ఇంటిలో ఈ ఏడాది జూలై 22న చోరీ జరిగింది. 35 గ్రాముల బంగారం, సుమారు కిలో వెండి వస్తువులతో పాటు రూ. 30 వేలు నగదు అపహరించుకుపోయారు. ఈ కేసులో నిందితుడైన గుడివాడలోని కొత్తపేటకు చెందిన ముద్దాని జగదీష్‌ను గన్నవరం అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో మరో చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఒక్కో కేసులో రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మహిళల రక్షణకు ఉద్యమాలే శరణ్యం

మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, ఇకపై ఉద్యమాలే శరణ్యమని మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు రోజు రోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఘాతుకం మరువకముందే మరో చోట మరో దుర్ఘటన జరుగుతుండటం స్త్రీలను భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోనే రాష్ట్రంలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్, మరో ఇద్దరిపై ఘోర దాడులు జరగటం లా అండ్ ఆర్డర్ ఉందా అన్న అనుమానం కలుగుతుందని తెలిపారు. ఆడపిల్లపై చేయి వేసిన వారికి అదే చివరి రోజు అవుతుందని సీఎం, హోం మంత్రి గడిచిన నాలుగు నెలల్లో పలుమార్లు ప్రకటించినా ఘోరాలు ఆగలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలు, చిన్న పిల్లలపై 74 నేరాలు జరిగాయన్నది సుస్పష్టమని తెలిపారు. మద్యంపై వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడిపించే దిశగా కూటమి ప్రభుత్వం మద్యం షాపులను గత ప్రభుత్వం కంటే ఎక్కువగా పెంచారని అన్నారు. వీటి వలన జరిగే అనర్థాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, దానిని తెలియ చేప్పేందుకు ఉద్యమాలు శరణ్యం అంటున్నామని తెలిపారు.